

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

"స్విమ్మింగ్‌కి వెళ్దామా?" అన్నయ్య అడిగాడు.

పెద్దగా నవ్వాను.

ఆశ్చర్యంగా చూసి "నవ్వుతున్నావేంటి?" అడిగాడు.

"జోక్ కాదా?"

"ఇందులో జోకేముంది?"

"నాకు వళ్ళు నొప్పులని ఇందాకే చెప్పానుకదా!"

"స్విమ్మ్ చేస్తే సెట్ అవుతుంది."

"కాళ్ళు, వేళ్ళు కొంకర్లు పోయి మునిగిపోతా"

"అంత డీప్ కాదు పూల్"

"నేను రాను. నువ్వు వెళ్ళిరా."

"పోనీ వచ్చి అక్కడ కూర్చో."

"కూర్చుని ఏం చెయ్యాలి?"

"చెక్క భజన."

కోపంగా చూసాను.

"సరే నేను వెళ్ళి గంటలో వస్తా. జాగ్రత్తగా ఉండు."

"సరే" అన్నయ్య వెళ్ళగానే తలుపు వేసాను.

అన్నయ్య వచ్చేదాకా కాలక్షేపం చేసి, రాగానే "బోర్ కొడుతుంది" అన్నాను.

అన్నయ్య స్నానం పూర్తవ్వగానే "ఏం చేద్దాం?" అడిగాడు.

"నీ ఇష్టం" అన్నాను.

"మ్యూజియంకి వెళదామా?"

"మ్యూజియమా? ఛీ. బోర్."

"ఛీ ఎందుకు? చాలా విషయాలు తెలుసుకోవచ్చు."

"నాకు బోర్. ఇంకేమైనా చేద్దాం."

"ఎప్పుడైనా వెళ్ళావా మ్యూజియంకి ఇక్కడ?"

"లేదు. కానీ బోర్."

"వెళ్ళి బోర్ అను వింటాను. రెడీ అవ్వు."

"అబ్బా, వద్దు ప్లీజ్."

"నీకు మంచి ఫోటోస్ తీస్తాను."

"సరే కానీ నాకు బోర్ కొట్టగానే వచ్చేద్దాం."

"అలాగే. నీ ఇష్టం."

ఇద్దరం కలిసి దాదాపు గంట ప్రయాణం చేసాము. అన్నయ్య ఆర్ట్ గురించి, తనకి నచ్చిన ఆర్టిస్ట్‌ల గురించి చెప్పాడు. నాకు ఆవులింతలు ఆగలేదు.

"చిన్నప్పుడు బొమ్మలు బాగా గీసేదానివిగా, ఇప్పుడు పెయింటింగ్ చెయ్యచ్చు నువ్వు. నాకు రాదు అని చెయ్యట్లేదు" అన్నాడు.

"నాకు బోర్. నేనేమైనా చిన్నపిల్లననుకుంటున్నావా ఇంకా పెయింటింగ్ చెయ్యడానికి?" అడిగాను.

"సరే మహాతల్లి" అని కోపగించుకుని, తిరిగి తనకి నచ్చే ఆర్ట్ గురించి చెప్పసాగాడు. కారు పార్క్ చేసి "పద" అన్నాడు.

ఇప్పుడు ఈ పెయింటింగ్స్ దగ్గర ఎంతసేపు ఉంటాడో, ఎన్ని క్లాసులు పీకుతాడో అని బిత్తరపోయాను.

"నాకు బోర్ అనగానే ఇంటికి వెళ్ళిపోవాలి" అన్నాను.

"సరే."

"ప్రామిస్?"

"ప్రామిస్"

అక్కడికి వెళ్ళాక తెలిసింది – అన్నయ్య నన్ను ఆర్ట్ మ్యూజియంకి కాదు, ఎయిర్‌క్రాఫ్ట్‌ల మ్యూజియంకి తీసుకొచ్చాడని.

"మొహం ఆనందంతో వెలిగిపోతుందే" ఒక ఫోటో తీస్తూ అన్నాడు.

"వావ్.. ఇన్ని ఎయిర్‌క్రాఫ్ట్స్ ఇప్పటివరకు చూడలేదు."

ప్రతిది చూసి, వాటి గురించి చదివి, కొన్నిటి గురించి అన్నయ్యకి చెప్పాను.

"దీని ప్రొపలషన్ ఇలా, దానికి ఇన్ని ఇంజన్లు, ఇది రివర్స్ కూడా వెళుతుంది" అంటూ నా మిడి మిడి జ్ఞానాన్ని పంచాను. అక్కడ ఉన్న మిసైల్‌ని చూసి మైమరచిపోయాను. దాని పక్కన నేను, అన్నయ్య ఫోటో తీసుకున్నాము. మ్యూజియం మొత్తంలో అన్నయ్య తీసుకున్న ఏకైక ఫోటో అదే. అక్కడ ఉన్న యు ఎస్ ఎయిర్‌ఫోర్స్ విమానాలు చూసి "నేను ఏదో ఒకరోజు ఈ విమానం ఎక్కితే బావుండు" అనుకున్నాను.

రాక్‌వెల్ బి – 1 లాన్సర్ మరియు కిట్టి హాక్ ఫ్లయర్ విమానాలను చూసి ఆశ్చర్యపోయాను. టెక్స్ట్‌బుక్‌లో చదివిన దానికన్నా ఎన్నో రకాల విమానాలు ప్రపంచంలో ఉన్నాయని అర్థమైంది. నాకు ఎంత తక్కువ తెలుసు అని చిన్నబోయాను. అది పసిగట్టి, "ఓకేనా?" అడిగాడు అన్నయ్య.

"ఇన్ని ఉన్నాయి విమానాలు. నాకు తెలీనే తెలీదు. ఇంక ఎప్పుడు నేర్చుకుంటాను? ఇలా ఇంకా ప్రపంచంలో ఎన్ని ఉన్నాయో? ఏరో స్పేస్ చదివి ఈ మాత్రం తెలీదంటే సిగ్గుచేటు" అన్నాను.

"ఒసేయ్, నువ్వు ఇంజనీరింగ్ నిన్నకాక మొన్న పూర్తి చేసావు. అదేదో డాక్టరేట్ సంపాదించి, ఇరవై ఏళ్ళు ఎయిర్ క్రాఫ్ట్‌ల మీద పనిచేసినట్టు ఫీల్ అవుతావేంటి?" అన్నాడు.

"నిజమే కానీ ఎలానో ఉంది."

"ఇప్పుడు నేర్చుకుంటున్నావని ఆనందించు. ఎప్పుడో తెలీదనో, ఇంకేదో రేపు నేర్చుకుంటావనో ఇప్పుడు దిగులు పడకు. హాయిగా హాలిడేస్ ఎంజాయ్ చెయ్యి."

అన్నయ్య మాటలు నాపైన పనిచేసాయి. తిరిగి హుషారుగా అన్నీ చూసాను. అక్కడ ఫిసియాలజీని ప్రయత్నించాము. మనం కుర్చీలో కూర్చుంటే స్ట్రాపులు, హార్ట్ రేట్ మానిటర్లు పెడతారు. ఆకాశంలో వెళ్ళేప్పుడు ఉండే జీ ఫోర్సులు, డిస్ ఓరియెంటేషన్ వంటివి తెలుస్తాయి.

"నచ్చిందా?" అడిగాను.

"యా. నీకు?"

"కొంచెం భయమేసింది కానీ చాలా బావుంది."

"ఇంకోటి ట్రై చేస్తావా?"

"యా. చేస్తాను."

"ఫ్లైట్ సిమ్యులేటర్‌లోకి వెళ్ళాము. నేను టెక్స్ట్ బుక్‌లో చదివినంత సులభం కాదు. తెలిసి నా ఓవర్ కాన్ఫిడెన్స్ కాస్త తగ్గింది. ఆ తరవాతి అపోలో మూన్ రాక్‌ని చూసి ఎంతో మైమరచిపోయాను. అన్నీ చూసి చివరికి ఇంటికి బయలుదేరాము.

"బోర్ కొట్టలేదా?" వెటకారంగా అడిగాడు.

"చాలా బావుంది" అంటూ ఓ వంద థ్యాంక్స్ చెపాను.

"అన్నిట్లో ఏ విమానం ఎక్కువ నచ్చింది?" అడిగాడు.

"నాసా డ్రీం చేసర్ ఇంకా విజర్డ్ ఆల్ట్రా లైట్ ఎయిర్ క్రాఫ్ట్. నీకు?"

"నాకు ఏలెక్సాండర్ ఈగిల్ రాక్ ఇంకా హాంగ్ గ్లైడర్ నచ్చాయి."

"ఓ.. నాకూ అవి నచ్చాయి" అన్నాను.

"గ్లైడర్‌లో ఎప్పుడైనా ఫ్లై అయ్యావా?"

"లేదు. నువ్వు?"

"ఇంకా లేదు. సమ్మర్‌లో చేద్దాం అనుకుంటున్నాను."

"నేను చేస్తాను. ప్లీజ్ అన్నయ్యా."

"ముందు స్కైడైవింగ్ చెయ్యి. భయంలేకపోతే అప్పుడు గ్లైడర్‌కి తీస్కుని వెళతాను.

"నాకేం భయంలేదు. ప్లీజ్."

"అయితే ముందు స్కై డైవ్. తరవాత గ్లైడర్."

"ఓకే. రేపు వెళ్దామా?"

"ఇంత చలిలోనా? తరవాత ఎప్పుడైనా వెళ్దాం."

ఇంతలో అమ్మ ఫోన్ చేసింది.

"అమ్మా నేను ఎన్ని విమానాలు చూసానో తెలుసా?" అంటూ దారి పొడుగునా కబుర్లు చెప్పాను. అన్నయ్య మిసైల్ ముందు మా ఇద్దరి ఫోటోని అమ్మకి పంపాడు.

"మీ ఇద్దరూ బాగా చిక్కిపోయారు" అంది.

"నిన్న స్కీయింగ్ చేసాముగా, అందుకనే అనుకుంటా" అన్నాను.

"ఒక్కరోజు స్కీయింగ్‌కి సన్నగా అయితే ప్రపంచంలో లావు వాళ్ళే ఉండరు" అన్నయ్య ఎగతాళి చేసాడు.

"టైముకి తింటున్నారా? అన్నయ్య అన్నీ కొని పెట్టాడా వంటకి?" అమ్మ అడిగింది.

"యా. బానే తింటున్నాము" అన్నాను.

"అంత పెద్ద మిసైల్ పక్కన నిలబడితే అలానే సన్నగా కనబడతాము. ఇద్దరం గుండ్రాయిలా బానే ఉన్నాను. నువ్వేం దిగులు పడకు" అన్నయ్య అన్నాడు.

"సరే. నీమీదే నా నమ్మకం" అంటూ కొన్ని అంజలీదేవి డైలాగులు కొట్టి ఫోన్ పెట్టేసింది అమ్మ.

ఇంటికి వెళ్ళగానే ఇద్దరం భోం చేసాము. ఇవాళ టీవి చూడ్డం కాకుండా మ్యూజియం గురించి మాట్లడుకుంటూ తిన్నాము. మర్నాడు మరో మ్యూజియంకి తీసుకెళ్ళమని, అది ఆర్ట్ అయినా ఫరవాలేదని అన్నయ్యకి చెప్పాను. నేను ఫోన్‌లో తీసిన విమానాల ఫోటోలు కొన్ని ఇన్స్టాగ్రాంలో పెట్టి, అవి చూస్తూ నిద్రలోకి జారుకున్నాను.

Click here to share your comments on this story